టిటాస్ తుఫాన్

విజృంభించిన యువ పేసర్ • తొలి టీ20లో భారత్ జయకేతనం • షఫాలీ, స్మృతి మెరుపులు

వన్డే సిరీస్‌లో విఫలమైన భారత అమ్మాయిలు.. పొట్టి ఫార్మాట్‌లో దుమ్మురేపారు. 50 ఓవర్ల ఫార్మాట్‌లో కంగారూల చేతిలో వైట్‌వాష్‌కు గురైన హర్మన్‌ప్రీత్ బృందం.. టీ20ల్లో శుభారంభం చేసింది. మొదట బౌలర్లు సత్తాచాటి ప్రత్యర్థిని ఓ మాదిరి స్కోరుకే పరిమితం చేయగా.. ఆనక ఓపెనర్లు దంచికొట్టడంతో టీమ్‌ఇండియా సునాయాసంగా గెలుపొందింది. షఫాలీ వర్మ, స్మృతి మంధన అర్ధశతకాలతో అదరగొట్టారు.

ముంబై: కంగారూలపై పూర్తి ఆధిపత్యం కనబర్చిన భారత మహిళల జట్టు.. టీ20 సిరీస్‌లో శుభారంభం చేసింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో విరుచుకుపడిన టీమ్‌ఇండియా.. శుక్రవారం జరిగిన తొలి టీ20లో 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఫలితంగా మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో హర్మన్‌ప్రీత్ బృందం 1-0తో ముందంజ వేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 19.2 ఓవర్లలో 141 పరుగులకు ఆలౌటైంది. లిచ్‌ఫీల్డ్ (32 బంతుల్లో 49; 4 ఫోర్లు, 3 సిక్సర్లు), ఎలీసా పెర్రీ (37; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించారు. కెప్టెన్ అలీసా హీలీ (8), తహీలా మెక్‌గ్రాత్ (0), ఆష్లే గార్డ్‌నర్ (0), గ్రేస్ హారీస్ (1), బెత్ మూనీ (17) విఫలమయ్యారు. మన బౌలర్లలో టిటాస్ సధు 4, శ్రేయాంక పాటిల్, దీప్తి శర్మ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్య ఛేదనలో భారత్ 17.4 ఓవర్లలో వికెట్ నష్టానికి 145 పరుగులు చేసింది. ఓపెనర్లు షఫాలీ వర్మ (44 బంతుల్లో 64 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్సర్లు), స్మృతి మంధన (54; 7 ఫోర్లు, ఒక సిక్సర్) హాఫ్ సెంచరీలు నమోదు చేసుకున్నారు. టిటాస్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య ఆదివారం రెండో టీ20 జరగనుంది.

ఇద్దరే దంచేశారు!

ఛేదనలో భారత్‌కు ఏమాత్రం ఇబ్బంది ఎదురుకాలేదు. డార్సీ బ్రౌన్ వేసిన తొలి ఓవర్‌లో.. బ్యాటర్ల ప్రమేయం లేకుండా మూడు ఫోర్లు రావడంతో టీమ్‌ఇండియాకు మెరుగైన ఆరంభం లభించగా.. ఇక అక్కడి నుంచి షఫాలీ, స్మృతి ఎడాపెడా బౌండ్రీలతో కంగారూలపై విరుచుకుపడ్డారు. సదర్లాండ్ బౌలింగ్‌లో మంధన సిక్సర్ బాదితే.. మేగన్ షుట్ ఓవర్‌లో షఫాలీ రెండు ఫోర్లు కొట్టింది. స్మృతి కాస్త ఆచితూచి ఆడినా.. షఫాలీ మాత్రం బౌండ్రీలే పరమావధిగా రెచ్చిపోయింది. ఈ క్రమంలో షఫాలీ 32 బంతుల్లో, మంధన 50 బంతుల్లో అర్ధశతకాలు పూర్తి చేసుకున్నారు. మన బ్యాటర్ల జోరుకు ఆసీస్ ఫీల్డింగ్ లోపాలు కూడా కలిసి రావడంతో టీమ్‌ఇండియా అలవోక విజయం సాధించింది.

స్మృతి (54)
షఫాలీ (64*)

టిటాస్(4/17)

బంతులు కాదు బుల్లెట్లు!

సొంతగడ్డపై ఏకైక టెస్టులో ఆస్ట్రేలియాను ఆటాడుకున్న భారత అమ్మాయిలు.. ఆ తర్వాత వన్డేల్లో అదే జోరు కొనసాగించలేకపోయారు. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో ఏమాత్రం ప్రభావం చూపలేక వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఓడి కంగారూలకు సిరీస్ అప్పగించారు. దీంతో అదనపు ఒత్తిడితో బరిలోకి దిగిన మన అమ్మాయిలు.. పొట్టి ఫార్మాట్‌లో ఇరగదీశారు. ఈ ఏడాది చివర్లో టీ20 ప్రపంచకప్ జరగనున్న నేపథ్యంలో యంగ్ ప్లేయర్స్‌కు ఎక్కువ అవకాశాలు ఇవ్వగా.. వాళ్లు సత్తాచాటారు. అండర్-19 స్థాయి నుంచే తన బౌలింగ్‌తో ప్రత్యర్థులను భయపెడుతున్న రైటార్మ్ పేసర్ టిటాస్ సధు.. బంతితో నిప్పులు చెరిగింది. నాలుగో ఓవర్‌లో బెత్ మూనీని ఔట్ చేసి వికెట్ల వేటకు తెరలేపిన టిటాస్.. ఆ తర్వాత తహీలా, గార్డ్‌నర్, సదర్లాండ్‌ను బుట్టలో వేసుకుంది. వేగం, కచ్చితత్వం కలగలిపి టిటాస్ సంధించిన బంతులకు కంగారూల వద్ద బదులే లేకపోయింది. మరో వైపు నుంచి శ్రేయాంక, దీప్తి కూడా విజృంభించడంతో ఆసీస్ తక్కువ పరుగులకే పరిమితమైంది.

సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా: 19.2 ఓవర్లలో 141 (లిచ్‌ఫీల్డ్ 49, పెర్రీ 37; టిటాస్ 4/17, శ్రేయాంక 2/19), **భారత్:** 17.4 ఓవర్లలో 145/1 (షఫాలీ 64 నాటౌట్, స్మృతి 54; జార్జియా 1/20).

జూన్ 9న భారత్ X పాకిస్థాన్

- **టీ20 ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల**

న్యూఢిల్లీ: క్రీడాభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న టీ20 ప్రపంచకప్ షెడ్యూల్ విడుదలైంది. అమెరికా, కెనడా మధ్య జూన్ 1న జరగనున్న మ్యాచ్‌తో మెగా టోర్నీ ప్రారంభం కానుండగా.. చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ మధ్య జూన్ 9న మ్యాచ్ జరగనుంది. వెస్టిండీస్, అమెరికా వేదికగా జరగనున్న పొట్టి ప్రపంచకప్‌లో భాగంగా దాయాదులు న్యూయార్క్‌లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) శుక్రవారం విడుదల చేసింది. ఆస్ట్రేలియా వేదికగా జరిగిన గత వరల్డ్‌కప్‌లో 16 జట్లు పాల్గొనగా.. ఈసారి 20 జట్లు పోటీపడుతున్నాయి. మొత్తం టీమ్‌లను 4 గ్రూప్‌లుగా విభజించారు. పాకిస్థాన్, ఐర్లాండ్, కెనడా, అమెరికాతో కలిసి భారత్ గ్రూప్-'ఏ'లో ఉంది. అమెరికాలో 3, వెస్టిండీస్‌లో ఆరు వేదికల్లో 55 మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. జూన్ 29న బార్బడోస్‌లో తుది పోరు జరగనుంది. గ్రూప్ దశలో భారత్.. జూన్ 5న ఐర్లాండ్‌తో, 9న పాకిస్థాన్‌తో, 12న అమెరికాతో, 15న కెనడాతో టీమ్‌ఇండియా తలపడనుంది.

తేదీ	ఎవరితో	వేదిక
జూన్ 5	భారత్ X ఐర్లాండ్	న్యూయార్క్
జూన్ 9	భారత్ X పాకిస్థాన్	న్యూయార్క్
జూన్ 12	భారత్ X అమెరికా	న్యూయార్క్
జూన్ 15	భారత్ X కెనడా	లాడర్‌హిల్

పాకిస్థాన్ 68/7

ఆస్ట్రేలియాతో మూడో టెస్టు

సిడ్నీ: పాకిస్థాన్‌తో మూడో టెస్టులో ఆస్ట్రేలియా విజయానికి చేరువైంది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి పాకిస్థాన్ రెండో ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు కోల్పోయి 68 పరుగులు చేసింది. అయూబ్ (33), బాబర్ (23) రెండంకెల స్కోరు చేయగా.. షఫీఖ్ (0), మసూద్ (0), షకీల్ (2), సాజిద్ (0), సల్మాన్ (0) విఫలమయ్యారు. ఆసీస్ బౌలర్లలో హాజిల్‌వుడ్ 4 వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 116/2తో శుక్రవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా 299 పరుగులకు ఆలౌటైంది. లబుషేన్ (60), మిషెల్ మార్ష్ (54) హాఫ్‌సెంచరీలు చేశారు. పాక్ బౌలర్లలో జమాల్ 6 వికెట్లు పడగొట్టాడు. ప్రస్తుతం చేతిలో 3 వికెట్లు ఉన్న పాకిస్థాన్ ఓవరాల్‌గా 82 పరుగుల ఆధిక్యంలో ఉంది.

రాహుల్ డబుల్ సెంచరీ

రాహుల్ (214)

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక దేశవాళీ టోర్నీ రంజీ ట్రోఫీ తొలి పోరులో హైదరాబాద్ బ్యాటర్లు అదరగొట్టారు. రాహుల్ సింగ్ (157 బంతుల్లో 214; 23 ఫోర్లు, 9 సిక్సర్లు) డబుల్ సెంచరీతో కదంతొక్కగా.. కెప్టెన్ తిలక్ వర్మ (100 నాటౌట్; 6 ఫోర్లు, 4 సిక్సర్లు) సెంచరీ చేశాడు. తన్మయ్ అగర్వాల్ (80) రాణించాడు. ఫలితంగా ప్లేట్ గ్రూప్‌లో భాగంగా నాగాలాండ్‌తో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్ 474/5 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన నాగాలాండ్ 11 ఓవర్లలో వికెట్ నష్టానికి 35 పరుగులు చేసింది. చేతిలో 9 వికెట్లు ఉన్న నాగాలాండ్.. హైదరాబాద్ స్కోరుకు 439 పరుగుల దూరంలో ఉంది.

సెమీస్‌లో యోధాస్

కటక్: అల్టిమేట్ ఖోఖో లీగ్‌లో తెలుగు యోధాస్(18) సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పోరులో యోధాస్ 38-30తేడాతో చెన్నై క్విక్‌గన్స్‌పై అద్భుత విజయం సాధించింది. మ్యాచ్‌లో ఆది నుంచే యోధాస్ తమదైన ఆధిపత్యం ప్రదర్శిస్తూ ఈ సీజన్‌లో సెమీస్ బెర్తు దక్కించుకున్న తొలి జట్టుగా నిలిచింది. యోధాస్ తరపున రాహుల్ మండల్ అటాకింగ్‌లో 10 పాయింట్లతో ఆకట్టుకున్నాడు. చెన్నై ప్లేయర్లను వరుస విరామాల్లో ఔట్ చేసిన యోధాస్ 24-0తో స్పష్టమైన ఆధిక్యం కనబరిచింది.

12 ఏండ్లకే రంజీల్లోకి

- **బీహార్ జట్టులోకి వైభవ్**

పాట్నా: బీహార్‌కు చెందిన వైభవ్ సూర్యవంశీ పిట్ట కొంచెం కూత ఘనమని నిరూపించాడు. 12 ఏండ్ల ప్రాయంలోనే దేశవాళీ రంజీ టోర్నీలో అరంగేట్రం చేసి ఔరా అనిపించాడు. శుక్రవారం ముంబైతో మొదలైన మ్యాచ్‌లో తన సొంత రాష్ట్రం బీహార్ తరపున వైభవ్ బరిలోకి దిగాడు. దీంతో పిన్న వయసులో రంజీల్లో అరంగేట్రం చేసిన నాలుగో క్రికెటర్‌గా వైభవ్ అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాడు. ఐదేండ్ల ప్రాయంలోనే క్రికెట్‌లోకి ప్రవేశించిన వైభవ్ మళ్లీ వెనుదిరిగి చూసుకోలేదు. గతేడాది కూచ్ బెహార్ ట్రోఫీలో బీహార్‌కు ఆడిన వైభవ్.. జార్ఖండ్‌తో మ్యాచ్‌లో సెంచరీ(128 బంతుల్లో 151, 22ఫోర్లు, 3 సిక్స్‌లు)తో పాటు అర్ధసెంచరీ(76)తో కదంతొక్కాడు. భారత అండర్-19 ఏ, బీ జట్ల తరపున వైభవ్ అదే జోరు కొనసాగించాడు. రహానే, శివమ్ దూబే, ధవల్ కులకర్ణి లాంటి స్టార్ క్రికెటర్లతో వైభవ్ కలిసి ఆడటం గర్వంగా భావిస్తున్నానని తండ్రి సంజీవ్ సూర్యవంశీ పేర్కొన్నారు.

వ్రితి డబుల్ ధమాకా

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఢిల్లీ వేదికగా జరుగుతున్న 67వ జాతీయ స్కూల్ గేమ్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర స్టార్ స్విమ్మర్ వ్రితి అగర్వాల్ పతకాల వేట దిగ్విజయంగా కొనసాగిస్తున్నది. శుక్రవారం జరిగిన బాలికల అండర్-19 400మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో వ్రితి 4:41:17సెకన్ల టైమింగ్‌తో పసిడి పతకంతో మెరిసింది. శిరిణ్, అమృత వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. అదే జోరు కొనసాగిస్తూ 800మీటర్ల ఫ్రీస్టయిల్‌లో వ్రితి(9:29:01) స్వర్ణం ఖాతాలో వేసుకుంది. బాలుర అండర్-17 200మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ విభాగంలో యువ స్విమ్మర్ సుహాస్ ప్రీతమ్ రజతం దక్కించుకున్నాడు. రెండు స్వర్ణాలు సాధించిన వ్రితిని కోచ్ జాన్ సిద్దిఖి అభినందించాడు.

చిత్రం

అల్లరి నరేష్, నాగార్జున

దేవుడే తన చేతితో..

అగ్ర హీరో నాగార్జున 'నా సామిరంగ' చిత్రంతో ఈ సంక్రాంతి బరిలోకి దిగుతున్నారు. విజయ్ బిన్ని దర్శకుడు. విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో జోరు పెంచింది. ఇటీవల విడుదల చేసిన టైటిల్ సాంగ్ మాస్ నెంబర్‌గా ఆకట్టుకోగా.. తాజాగా 'దేవుడే తన చేతితో' అనే మూడో గీతాన్ని శుక్రవారం విడుదల చేశారు. నాగార్జున, అల్లరి నరేష్‌ల మధ్య ఉన్న స్నేహబంధాన్ని ఆవిష్కరిస్తూ హృదయానికి హత్తుకునేలా ఈ పాట సాగింది. బాల్యం నుంచి వారి మధ్య ఉన్న గాఢమైన అనుబంధాన్ని చూపిస్తూ అర్థవంతమైన సాహిత్యంతో ఆకట్టుకుంది. స్వీయ స్వరకల్పనలో ఎం.ఎం.కీరవాణి రాసిన ఈ గీతాన్ని శాండిల్య ఆలపించారు. గ్రామీణ నేపథ్యంలో సాగే మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఆషికా రంగనాథ్, మిర్నా మీనన్, రుక్సార్ థిల్లాన్, అల్లరి నరేష్, రాజ్‌తరుణ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: శివేంద్ర దాశరథి, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, నిర్మాణ సంస్థ: శ్రీనివాస సిల్వర్ స్క్రీన్, నిర్మాత: శ్రీనివాస చిట్టూరి, దర్శకత్వం: విజయ్ బిన్ని.

రష్మిక మందన్న

సంపాదన మొత్తం పెట్టుబడులకే..

కన్నడ కస్తూరి రష్మిక మందన్న తన సంపాదనలో రియల్‌ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కే ఎక్కువ ప్రాధాన్యతనిస్తుందని తెలిసింది. దక్షిణాదితో పాటు హిందీ చిత్రసీమలో కూడా ఈ భామ తిరుగులేని ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. ముఖ్యంగా 'పుష్ప'..ఇటీవల విడుదలైన 'యానిమల్' చిత్రాలు జాతీయ స్థాయిలో ఆమె స్థానాన్ని సుస్థిరం చేశాయి. ఈ నేపథ్యంలో ఈ భామ ఒక్కో సినిమాకు నాలుగు కోట్ల వరకు రెమ్యునరేషన్‌ను అందుకుంటున్నదని సమాచారం. సినిమాలతో పాటు బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌ల ద్వారా ఈ అమ్మడు భారీ మొత్తంతో ఆర్జిస్తున్నది. బెంగళూరులో రష్మిక కొనుగోలు చేసిన బంగ్లా దాదాపు 10కోట్ల విలువ ఉంటుందని తెలిసింది. అలాగే ముంబయిలో ఓ విలాసవంతమైన అపార్ట్‌మెంట్ ఇటీవలే ఖరీదు చేసిందని సమాచారం. వీటితో పాటు గోవా, కూర్గ్, హైదరాబాద్‌లో పలు అపార్ట్‌మెంట్‌లను రష్మిక కొనుగోలు చేసిందని చెబుతున్నారు. వ్యాపారం నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి రావడంతో రష్మిక మందన్న పెట్టుబడుల విషయంలో తెలివిగా నిర్ణయాలు తీసుకుంటున్నదని ఆమె సన్నిహితులు చెబుతున్నారు.

తనయుడు అవ్రామ్‌తో మంచు విష్ణు

మంచు విష్ణు కొడుకు ఎంట్రీ

మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప'. ముఖేశ్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మలయాళ స్టార్ హీరో మోహన్‌లాల్, ప్రభాస్‌తో, ఎం.మోహన్‌బాబు వంటి హేమాహేమీలు నటిస్తున్నారు. తాజాగా మంచు ఫ్యామిలీ నుంచి మూడోతరం నటుడు ఈ సినిమాతో ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. విష్ణు తనయుడు మంచు అవ్రామ్ 'కన్నప్ప'తో బాల నటుడిగా ఎంట్రీ ఇవ్వనున్నారు. దీంతో ఈ చిత్రంలో ఒకే ఫ్యామిలీకి చెందిన మూడు తరాలు నటిస్తున్నట్టు అయ్యింది. అవ్రామ్ పాత్రకు 'కన్నప్ప'లో చాలా ప్రాధాన్యత ఉన్నట్టు తెలుస్తోంది. మంచు విష్ణు మాట్లాడుతూ 'నా కొడుకు అవ్రామ్ కీలక పాత్రలో నటించడం చాలా గర్వకారణం. ఇది మా కుటుంబ మూడు తరాల కలయికతో వస్తున్న అరుదైన సినిమా' అని చెప్పుకొచ్చారు.

మారింది తేదీ మాత్రమే..

రవితేజ 'ఈగల్' చిత్రం సంక్రాంతి బరిలో నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే. ఈ నెల 13న ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేశారు. అయితే సంక్రాంతి సీజన్‌లో థియేటర్స్ లభ్యతలో కలిగే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని, పరిశ్రమ క్షేమాన్ని కాంక్షిస్తూ ఈ చిత్రాన్ని మేకర్స్ వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. ఫిబ్రవరి 9న ప్రపంచవ్యాప్తంగా ఈ యాక్షన్ థ్రిల్లర్‌ను విడుదల చేయబోతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. 'బాగ కోసం బరిలో రద్దీ తగ్గించాం. ఓ జనరంజకమైన చిత్రాన్ని చూడటానికి అంతే మొత్తంలో థియేటర్లు కావాల్సి ఉంటుంది. అందుకే వాయిదా నిర్ణయం తీసుకున్నాం. మారింది తేదీ మాత్రమే మాసోడి మార్క్ కాదు' అంటూ చిత్ర నిర్మాణ సంస్థ ట్విట్టర్‌లో పేర్కొంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ చిత్రానికి కెమెరా: కార్తీర్ ఘట్టమనేని, కమిల్ ప్లాకి, కర్మ్ చావ్లా, సంగీతం: డేవ్ జాంద్, ఎడిటింగ్, దర్శకత్వం: కార్తీక్ ఘట్టమనేని.

రవితేజ

రాక్షసుల్ని వేటాడే 'భీమా'

గోపీచంద్ యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భీమా'కు సంబంధించిన టీజర్‌ను మేకర్స్ శుక్రవారం విడుదల చేశారు. కన్నడ దర్శకుడు ఎ.హర్ష తెలుగులో చేస్తున్న ఈ చిత్రాన్ని శ్రీసత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై నిర్మాత కేకే రాధామోహన్ లావిష్‌గా నిర్మిస్తున్నారు. 'యధా యధా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత' అనే భగవద్గీత శ్లోకంతో పవర్‌ఫుల్ వాయిస్ ఓవర్‌తో టీజర్ ప్రారంభమైంది. 'ఈ రాక్షసుల్ని వేటాడే బ్రహ్మ రాక్షసుడు వచ్చాడ్రా' అని బ్యాక్‌గ్రౌండ్‌లో వాయిస్ వినిపిస్తుంది. ఆ తర్వాత ఎద్దుపై కూర్చొని మాసివ్, వైల్డ్ అవతారంలో గోపీచంద్ ఎంట్రీ ఆకట్టుకుంది. ఖాకీలో పవర్-ప్యాక్డ్ లుక్‌లో గోపీచంద్‌ను చూడటమంటే అభిమానులకు పండగే. టీజర్‌లో విజువల్స్ గొప్పగా ఉన్నాయి. హర్ష తన అద్భుతమైన టేకింగ్‌తో ఆకట్టుకున్నాడు. స్వామి జె గౌడ కెమెరా పనితనమూ అద్భుతంగా తోచింది. సలార్ ఫేమ్ సంగీత దర్శకుడు రవి బస్రూర్ సెన్సేషనల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో అదనపు ఎనర్జీని జోడించారు. మొత్తానికి ఈ టీజర్ సినిమాకు హైప్ క్రియేట్ చేసేలా ఉంది. 'భీమా' ఫిబ్రవరి 16న ప్రేక్షకుల ముందుకు రానుందన్న విషయాన్ని ఈ టీజర్ ద్వారానే అనౌన్స్ చేశారు మేకర్స్. ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాకు కెమెరా: స్వామి జె గౌడ, నిర్మాత: కేకే రాధామోహన్, దర్శకత్వం: ఎ.హర్ష.

గోపీచంద్

దర్శకుడి లిరిక్స్‌తో టైటిల్ సాంగ్

శివ కందూకూరి హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'భూతద్దం భాస్కర్ నారాయణ'. స్నేహాల్, శిశిధర్, కార్తీక్ నిర్మించిన ఈ క్రైమ్ థ్రిల్లర్‌కు పురుషోత్తం రాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో టీజర్ ఇప్పటికే ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచింది. శ్రీచరణ్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి టైటిల్ సాంగ్‌ను మేకర్స్ శుక్రవారం విడుదల చేశారు. శ్రీచరణ్ స్వరపరిచి స్వయంగా పాడిన ఈ పాట సంగీత ప్రియుల హృదయాలను హత్తుకునేలా ఉంది. పురుషోత్తం రాజ్, సురేశ్ బనిశెట్టి రాసిన ఈ లిరిక్స్ హీరో క్యారెక్టరైజేషన్‌ను ఆకట్టుకునేలా ప్రజెంట్ చేశాయి. ఫిబ్రవరిలో విడుదలకు సన్నాహాలు చేస్తున్న ఈ సినిమా ప్రధాన తారాగణం: రాశీ సింగ్, అరుణ్‌కుమార్, దేవిప్రసాద్, వర్షిణి సౌందర రాజన్, సంగీతం: శ్రీచరణ్ పాకాల, విజయ్ బుల్గానిన్, కెమెరా: గౌతమ్ జార్జ్, దర్శకత్వం: పురుషోత్తం రాజ్.

'సైంధవ్' కన్నీళ్లు తెప్పిస్తాడు!

'వెంకటేష్ నాకు చాలా ఇష్టమైన హీరో. ఆయన 75వ చిత్రాన్ని నిర్మించే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నా' అన్నారు వెంకట్ బోయనపల్లి. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై వెంకటేష్ కథానాయకుడిగా ఆయన రూపొందించిన చిత్రం 'సైంధవ్'. శైలేష్ కొలను దర్శకుడు. ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత వెంకట్ బోయనపల్లి శుక్రవారం పాత్రికేయులతో ముచ్చటించారు.. వెంకటేష్‌తో సినిమా చేయాలన్న నా కల ఈ సినిమాతో తీరింది. కథ చెప్పగానే ఆయన వెంటనే ఒప్పుకున్నారు. 'ఇదంతా డెస్టినీ' అని వెంకటేష్ నాతో చెప్పారు. న్యూ ఏజ్ ఫ్యామిలీ యాక్షన్ డ్రామా ఇది. కథలో భావోద్వేగాలు కన్నీళ్లు తెప్పిస్తాయి. యాక్షన్ బ్యాక్‌గ్రౌండ్ సినిమా అయినప్పటికీ కుటుంబ ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుంది. దర్శకుడు శైలేష్ కొలను యాక్షన్, ఎమోషన్స్‌ను బ్యాలెన్స్ చేస్తూ అద్భుతంగా తీశాడు. వెంకటేష్ తన పాత్రలో ది బెస్ట్ పర్‌ఫార్మెన్స్ కనబరిచారు. సంతోష్ నారాయణ్ సంగీతం ప్రధానాకర్షణగా నిలుస్తుంది.

మల్టీస్టారర్ చేస్తా

ఈ కథ స్పాన్ చాలా పెద్దది. అందుకే నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఆర్య, ఆండ్రియా వంటి స్టార్స్‌ను తీసుకున్నాం. ప్రొడక్షన్స్ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా తెరకెక్కించాం. నాని మా సంస్థలో రెండు సినిమాలు చేసి నాకు నిర్మాతగా గుర్తింపును తీసుకొచ్చారు. నాని లాగానే వెంకటేష్ కూడా బాగా ఇష్టం. వారిద్దరితో మల్టీస్టారర్ సినిమా చేయాలన్నది నా డ్రీమ్. అందుకోసం ప్రయత్నాలు చేస్తున్నా.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.